# విమల

ఇంకా రోహిణి రానేలేదు, ఎండలు మండిపోతున్నాయి. అనుకోని సంఘటనగా అమాంతం వచ్చిపడిన ఎండలను అతి కష్టంమీద కొసలకు గెంట గల్గాయి రావియాకులు. పొడుగుదేలిన పత్రాగ్రాలు వెలిగిపోతున్నాయి వేడికి. ఆ ఎండ వేడికి తట్టుకోలేక ఆకాశం వెళ్ళి చెరువులో పడింది. ధార మెక్కువై పోగా నిశ్చలత కుదరక చెరువు చిన్నగా అల్లల్లాడింది. నీళ్ళకు ఒక రంగంటూ లేకుండా పోయింది. ఆ ఎండల్లో, ఏమాత్రము తీరిక వున్నవాళ్ళు పగటి నిద్రకు అలవాటు పడిపోయారు. ఇంటిల్లపాది హాల్లో చాపలు పరుచుకుని 'ఫేన్' క్రింద నిద్రపోతుంటే విమల మాత్రం తన గదిలో మంచంమీద పడుకుని ఏవిఁటో ఆలోచిస్తోంది. ఎండ సంగ తేమీ పట్టినట్లు లేదామెకు. పోస్టుమేన్ కేకకు వులిక్కిపడి గంతేసి పరిగెత్తింది వాకిట్లోకి. అంది పుచ్చుకున్న కవరు చూడకుండా చింపి వెయ్యవలసినదే కాని, ఎందుకో-నిదానించి చూసింది. దస్తూరి చక్రపాణిదే కాని, వుత్తరం విమలకు కాదు. "నాన్నగారికి వ్రాశాడేవిటి!" అనుకుంది. నిద్రపోతున్న తండ్రిపైన "నాలుగు అయితేకాని లేవ రీయన!" అని విసుక్కుంది. "ఏమి వ్రాశాడో సెలవల కింటికి వచ్చి పదిహేను రోజులైంది. రాగానే వ్రాశాడు తనకు '**మూడు రోజుల్లో** వస్తున్నానని' మనిషి అజలేడు సరికదా వుత్తరం కూడా లేదు. ఈ కవరు చూస్తే నాన్నగారికి వ్రాశాడు. పరీక్షలు బాగానే వ్రాసినట్లు వ్రాశాడు పోయిన ఉత్తరంలో-ఏం జరిగిందీ తెలియకుండా వుందే...." ఆలోచన

లతో చికాకు పెట్టేసింది మనస్సు. ఉత్తరం బల్లమీద పెట్టి, మనసు కుదుటపడ్డాని కొాక పుస్తకం తీసి చదవటం మొదలు పెట్టింది.

విమలకు చక్రపాణి తండ్రివంకన దూరపు బంధువు. రెండేళ్ళయింది. వాళ్ళ సంబంధం స్థిరపడిపోయి. కాని చక్రపాణి ఇంజనీరింగు కాలేజీలో చేరి, రెండేళ్ళయింది కనుక; ఎందుకైనా మంచిదని ముహూర్తం మరి రెండేళ్ళకు వాయిదా వేసుకున్నారు. అదివరకు తెలిసినవారే కనుక తగినంత చనువు వుండటంచేత విమల చక్రపాణి వుత్తర ప్రత్యుత్తరాలు చదువుకోటానికి ఎవరికి ఏమీ అభ్యంతరం లేకపోయింది. ఇంట్లో వుండి చేసేదేమున్నదని విమల 'మేథమెటిక్స్' ఆనర్సు కంటూవాల్తేరు వెళ్ళింది. విమల శివయ్యగారికి పెద్దకూతురు. విమలకన్న ఐదేళ్ళ చిన్న భాస్కరం. భాస్కరానికి, భవానికి నాలుగేళ్ళ వార. చక్రపాణి, తండ్రి కొక్కడే కొడుకు. తల్లి అతని చిన్నప్పుడే పోయింది.

ఆ సాయంత్రం శివయ్యగారు వుత్తరము చూసుకుని భార్యని పిలిచారు. "ఇవాళ తారీఖు తొమ్మిది గాదూ, పన్నెండున చక్రపాణి వస్తాట్ట!" అన్నారు. భాగ్యమ్మ "ఎప్పుడో వస్తానని వ్రాసినవాడు యిన్నాళ్ళు ఎందుకు రానట్టు! అంతా కులాసా అటనా?" అని అడిగింది భర్తను. "అనుకుంటాను. వివరాలేమి వ్రాయలేదు" అన్నారు శివయ్యగారు.

మర్నాడు కుముదం వచ్చింది. కుముదం విమల స్నేహితురాలు. ఇద్దరూ ఇంటరు కలిసి చదివారు. కుముదం తండ్రి వుద్యోగ రీత్యా మధురలో వున్నాడు కొన్నాళ్ళు. ఆయన పోయిన తర్వాత కుముదం తల్లితోపాటు మేనమామ సంరక్షణలో చేరింది. ఆయన బహు కుటుంబీకుడు. డబ్బులేక కుముదాన్ని చదివించనూలేదు. కట్నమిచ్చి పెండ్లి చెయ్యనూలేదు. ఇంటరయ్యాక ఊరికేనే ఉంది కుముదం. చిన్నప్పటి అలవాటున ఒక్కొక్కసారి 'అరవయాస'తో తెలుగు మాట్లాడుతుంది. "ఏమిటి నీ భాష?" అని విమల అంటే "నా భాషకేం? పుస్తకం తెలుగు. అట్టేమాట్లాడితే అచ్చ తెనుగు" అంటుంది కుముదం.

కుముదం రాగానే భవాని చెప్పింది "బుధవారం మా చక్కెరబావ వస్తున్నాడుగా" అని. చక్రపాణిని 'చక్కెరబావ' అనటం భవానికి కుముదమే నేర్పింది.

"ఏం విమలా! పానకాలస్వామి వస్తున్నారట! పరధ్యాన మెక్కువైంది అందుకనా, పిల్చినా పలుకవు?" అన్నది కుముదం.

"కుముదం. నీ అఘాయిత్యానికి అంతులేదే! వస్తుంటివి చూసి నవ్వితిని, ఇంతలో నాకెక్కడి పరధ్యానం" అన్నది విమల.

"పరధ్యానంగా లేకపోవటము మరీ వింత" అన్నది కుముదం. చక్రపాణి విడతీస్తే చక్కెరపాని, సూక్ష్మీకరిస్తే పానకం-చక్రపాణి పానకాల స్వామి అంటూ కుముదం చెప్పే వ్యాఖ్య యిది.

"అది సరేలే, ఇదివరకు మహా తాను కనుక కాశీవరకు వెళ్ళినట్లు తెగకోసేవాడుగా! యీ ఏడు నువ్వూ వాల్తేరు వెళితివి. మరి అతనికి తగినట్లు సిద్ధం చెయ్యి కబుర్లు. మీ హాస్టర్, హాస్టల్ కల్లంతదూరంలోనే వున్న సముద్రము. కాలేజి, మరి-మీ క్లాసులో అబ్బాయిలు - బాగా ఘాటుగా చెప్పు, దారికొస్తాడు" అన్నది కుముదం. విమల నవ్వింది.

నిజమే, చక్రపాణి కోతలకు సరిహద్దులుండవు. క్రొత్తలో ఒకసారి విమల అడిగింది అతని హాస్టలు కబుర్లు. అతడు వర్ణించి చెప్పాడు. "మా హాస్టలు సరిగ్గా గంగఒడ్డునే వుంటుంది. నాగది మేడమీదిది. నదివైపుకుంటుంది ఒక కిటికీ, అక్కడే నా పక్క." చిన్న జల్లులన్నా, చల్లగాలులన్నా విమల సంతోషంతో వంపులు తిరిగిపోతుందని చక్రపాణికి తెలుసు. "కిటికీలోంచి, నీటి పొరలను రేపుకొచ్చే తడిగాలి; బైటకు చూస్తే ఒడ్డున లంగరువేసున్న పడవలు, పాటలు పాడుకునే సరంగులు, సాయంత్రాలు ఒక గంట 'బోటింగు' కంటూ బైలుదేరి నదిఒడ్డున సరంగులతో గీసిగీసి బేరాలాడే యూనివర్శిటీ అమ్మాయిలు, ఒడ్డున యిసుకలో యిల్లుకట్టే పడవవాళ్ళ చిన్నపిల్లలూ...." అంతవరకు విని ఆగలేక పోయింది విమల. "ఫో-అంతా కోతలు- గంగఒడ్డు, చిన్నపిల్లలు, పిచ్చుకగూళ్ళు-ఎక్కడో చదివాం! నీదంతా అబద్ధమే. ఇది ఏదో

నవలలోది" అన్నది. "సరే అయితే యిక చెప్పను" అన్నాడు చక్రపాణి. "పోనీలే, అంతా నిజమే, యింకా చెప్పు" అన్నది విమల. "మరి యింకా, యింకా, నదికవతల ఒడ్డున రామనగర్ రాజమహలు. కళ్ళు చికిలించిచూస్తే, సాయంత్రం పై అంతస్తుమీద పాలరాతి కుర్చీలో కూర్చుని ప్రకృతిశోభ తిలకించే మహారాజులుంగారు...." "ఇక చాల్లే. కోయకు మరి. కావాలంటే ఒక కాని యిచ్చుకుంటాను. నయ్యం, రాజకుమార్తెలన్నావు గాదు" అన్నది విమల. ఇంకోసారి "ఏమయితే మాత్రం, అంతగా పోట్లాడుతారా వార్డెన్‌తో, హాస్టలునుంచి గెంటితే ఏం జేస్తావ్" అన్నది. "అది హాస్టలేగా, అనాధ శరణాలయం కాదుగద. అర్థంలేకుండా అభిమానం చంపుకుని అక్కడే పడివుండే ఖర్మం? గది అద్దెకిచ్చే నాధుడే దొరకడా వూరన్న తర్వాత" అన్నాడుచక్రపాణి. "ఆ నాధుడూ దొరక్కపోతే, గంగా తీరాన పర్ణశాల వేసుకుని గడపగలవు ఋషి కుమారుడవు!" అన్నది విమల. "రైటో! నిజంగా గంగ ఒడ్డున గుడిసె వేసుకుంటే?—నాకా ఐడియానే రాలేదు ఇన్నాళ్ళు." అన్నాడు చక్రపాణి.

పాత సంగతులన్నీ చెప్పుకుని నవ్వుకున్నారు విమల, కుముదం. కుముదానికి విమలంటే అంత పెద్ద ఆపేక్షేమీ లేదసలు. కుముదం వయస్సు ఆశించిన ప్రణయం కుముదానికి లభించలేదు. విమలలో ఆ ఛాయలు చూచే తృప్తిపడుతుంది కుముదం.

ఆ తర్వాత రెండు రోజులకు చక్రపాణి వచ్చాడు. బండి దిగే సరికి వాకిట్లోకి వచ్చింది విమల. ముఖమంతా నవ్వుచేసుకుని అనుకోకుండానే చిన్నగా నవ్వేశాడు చక్రపాణి. విమల ఆకర్షణ అట్లాంటిది. పూర్వము ఎన్నోసార్లనుకున్నాడు చక్రపాణి. 'ఆమె తనువొంపులు తీయని తలపులకు ప్రతి బింబాలని' విమల అట్టే అందమైనది కాదు. కాని ఆమె నిలచే భంగిమ, వంగే తీరు. పెద్దవి, చిన్నవి కాక ఎప్పటి

కప్పుడు క్రొత్తగా తోచే లేత నవ్వులు, మాట్లాడేటప్పటి ముఖకవళికలు- అంతా ఒక సంకల్ప రహితమైన అభినయ విశేషం. అదే ఆమెలోని ఆకర్షణ: నవ్వినవాడు నవ్వినట్లుండక మధ్యలోనే త్రుంపి గంభీరుడై పోయాడు చక్రపాణి. విమల కలవరపడింది. అతని ముఖములోని ప్రతి రేఖా ఆమెకో ప్రశ్నగా తోచింది. ఎంత ఆలోచించినా ఒక్క ప్రశ్నకూ సమాధానము దొరకలేదామెకు.

ఆ సాయంత్రం చక్రపాణి "పార్కు కెళ్దాం పద" అన్నాడు విమలతో. ఏమాత్రం వుత్సాహం లేదతని కోరికలో. ఒక మూలగా వెళ్ళి కూర్చున్నారు. చక్రపాణి మాటలు వెతుక్కుంటున్నవాడిలా కనిపించాడు. విమల "ఏం బావా, అట్లావున్నావ్" అన్నది. "విమలా తికమకలు నాకు తెలియవు. సూటిగా అడుగుతాను, సూర్యనారాయణ ఎవరు?" అన్నాడు చక్రపాణి. క్షణంపాటు విమల ముఖం తెల తెలపోయింది. అది గమనించిన చక్రపాణి వ్యంగ్యంగా నవ్వాడు. అది చూచిన విమల కోపంతో కదిలిపోయింది. "అతనెవరో నీకు ఏమీ తెలియకపోతే, ఆ ప్రశ్న నన్నడిగేవాడివేకాదు. నువ్వడగదల్చింది యింకా సూటిగా అడుగు. సూటి గానే చెప్తాను" అన్నది విమల.

చక్రపాణి, తాను ముగగా వూహించిన విమలనుండి అట్టి సమాధాన మూహించలేదు. తేరుకుని "సరే, మీ యిద్దరి స్నేహానికి అడ్డు చెప్పే అధికారము నాకులేదు, కాని నీ యీ అభినయానికి కారణమడిగే అర్హత వుందనుకుంటాను" అన్నాడు. విమల చివాలున లేచి దారి తీసింది. చక్రపాణి మంత్రముగ్ధుడిలా ఆమె వెనకే నడిచాడు. ఇల్లు చేరేవరకు ఎవరు మాట్లాడలేదు. విమల అవమానంతో, చక్రపాణి అనుమానంతో అలమటించి పోతున్నారు.

భాస్కరం చక్రపాణి దగ్గర చేరి కబుర్లు చెప్పుతున్నాడు. "ఆకలికి ఓర్వలేక రొట్టె దొంగిలిస్తే, అది దొంగతనము కాకపోతుందా?" అంటున్నాడు భాస్కరం. అంతలోనే విమల అక్కడకు వచ్చింది. ఆమె రాక గుర్తించిన చక్రపాణి నవ్వి "నీ వింకా చిన్నవాడివి భాస్కరం-అదే సహ

జమూ, సాధారణము కూడా. అవసరం కల్గితే 'అధర్మం' అడ్డురాదు. మీ అక్కను అడుగు పోనీ—" అన్నాడు, విమలవంక చూస్తు! అతని మాటల్లోని వ్యంగ్యానికి గాయపడింది విమల. కాని నిగ్రహించుకుంది. "ఆ పరిస్థితుల్లో ఎవరైనా అట్లాగే చేస్తారు. అదే సహజం అనటం, అన్యాయం, అసమంజసము. పరిస్థితులు ప్రకృతిరేపే అలలు, సృష్టించే సుడిగుండాలు. ప్రకృతిని జయించి స్వతంత్రంగా ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవడమే సంస్కారం. మనుష్యులెవ్వరికీ అట్టి సంస్కారం వుండదనుకోటం మనలను మనం తేలికపర్చుకోటమే" అన్నది విమల. చక్రపాణి మళ్ళీ దెబ్బతిన్నాడు. విమల ముఖంలోని ఆవేశపు వెలుగును చూచి ముగ్ధుడయ్యాడు. ఔను, ఎప్పుడూ అదే ఆకర్షణ ఆమెలో. చెరువులో పడిపోయిన చందమామలా గిలగిలా తన్నుకుంది అతని మనస్సు. గతస్మృతులు గుర్తుకొచ్చాయి. ఒకనాడు యిద్దరు వెళ్తున్నారెక్కడికో. దారిలో విమల "నాకు సంతోషంగా వుంది చాలా" అంది. "ఏం విశేషం?" అన్నాడు చక్రపాణి. "అటు చూడు" అంది విమల. ముదురు నీలంరంగు ఆర్టు సిల్కుచీర కట్టుకుని రోడ్డు వూడుస్తోంది ఒక ఆడది. తల్లో చామంతులు, నోట్లో తమలపాకులు. ముఖాన పెద్దబొట్టు. కళ్ళచుట్టు నల్లగా కాటుక! "ఏ పెళ్ళినాటి చీరో-అంత నిర్లక్ష్యంగా కట్టుకుందేం?" అన్నాడు చక్రపాణి. "అదికాదు బావా, యివాళ ఏదో సంతోషంలో వుంది. దానిలో చీర పాడవుతుందన్న బెంగలేదు. చూడు, తనలో తను ఎట్లా నవ్వుకుంటోందో!" అన్నది విమల. చక్రపాణికి విమలపై ప్రేమ పొంగిపోయింది. "విమలా నిన్నుచూస్తే నా కేమనిపిస్తుందో తెలుసా?" అన్నాడు.

"ఓహో-ఇది రోడ్డండీ బావగారూ" అని నవ్వింది విమల.... విమలను మర్చిపోవటం అసాధ్యం" అనుకున్నాడు చక్రపాణి.

విమలకు నిద్రపట్టలేదారాత్రి. యూనివర్శిటీలో జరిగిన గొడవ చక్రపాణివరకు ఎలా వ్యాపించింటో ఆమె కర్థంగాలేదు. అపవాదు లనేవి అడవుల్లాగా ఎలా పెరిగి పెద్దవై వ్యాపిస్తాయో అనుభవంమీద

తెలుసుకుని ఆశ్చర్యపోయింది. చక్రపాణి వాళ్ళవూళ్ళో వా ర్తేరు విద్యార్థు లెవరైనా వున్నారేమో ననుకుంది. చక్రపాణికూడా అనుమానించినందుకు వ్యథపడది. ఆశ్చర్యపడింది. మూఢమైన ప్రేమను నిరసిస్తాడతడు. పూర్వ మొకనాడు చక్రపాణి అద్దంముందు నిల్చుని దువ్వెనకు లొంగని జుట్టుతో కుస్తీపడ్తూ "ఛీ వెధవజుట్టు" అని విసుక్కున్నాడు. ఆ ప్రక్కనే నిలబడ్డ తాను "నీజుట్టుకేం బావా, చక్కగా ఉంటుంది" అన్నది. ఆ మాటకు చక్రపాణి మురిసిపోలేదు. పైగా "ఆడవాళ్ళకు ఒక మనిషిమీద ఇష్టమంటూ కుదరాలేగాని, వాళ్ళ వికారాలు కూడా విశేషాలుగానేకన్పడ తాయి. భర్త గుర్రుపెట్టి నిద్రపోతుంటే, ఆ గురకలో సంగీతం వినే ఆడ వాళ్ళుంటారు" అని ఎత్తిపొడిచాడు. వ్యక్తిత్వాన్ని అంతగా గౌరవించే చక్రపాణి అనవసరంగా అనుమానాలు పెంచుకుని అవమానించాడు తనను. 'తనదాకా' వస్తే ఎవరైనా అంతే!

మరునాడు మళ్ళీ ఏకాంతం చూసుకుని విమలను కలుసుకున్నాడు చక్రపాణి. విమలను తప్పిదం ఒప్పుకుంటే మనసారా క్షమించి స్వీక రించవచ్చు ననుకున్నాడు. "విమలా అసలు సంగతి చెప్పవూ?" అన్నాడు బ్రతిమాలుతున్నట్లు. విమల ముఖం విచారంతో చిన్నదైంది. ఒక్కసారి చక్రపాణి ముఖంలోకి చూచి మళ్ళీ కళ్ళు దించుకుంది! అప్రయత్నంగా చెమ్మగిల్లాయి ఆమె కళ్ళు. "నీ తప్పును ఒప్పుకోలేవా విమలా? భయ పడక, నిజంచెప్పు. నీవెంత తప్పు చేసినాసరే క్షమించగలను నిన్ను" అన్నాడు చక్రపాణి. విమల ముఖం ఎఱ్ఱనైంది. నిజంగా క్షమించగలి గిన వాడైతే తన్నట్లా అడిగివుండేవాడే కాదనుకుంది పైగా అతని ఔదార్యంపైన అతని కెంతగర్వం? ఆ అహంకారాన్ని చూచి అసహ్య పడింది. మ్లానంగా నవ్వి "అపరాధమైతే అంగీకరించగలను కాని, అప వాదు నెలా అంగీకరించను?" అన్నది. "ఇంకంతే నంటావ్!" చక్రపాణి స్వరం హెచ్చింది. విమల కళ్ళెత్తి అతని కళ్ళలోకి చూస్తూ "లేకపోతే నీ కాళ్ళమీదపడి 'నీ పాదాలసాక్షిగా నేనే తప్పు చేయలేదని' ప్రమాణం చెయ్యమంటావా, అది నావల్ల అయ్యే పనికాదు" గిరుక్కున వెనుతిరిగి

వెళ్ళిపోయింది విమల. చక్రపాణి కేమీ తోచలేదు. కళ్ళపైన నీటిపొరలు నిలచి చూపు మసకేసింది. ఆశ్చర్యపోయి కళ్ళు నలుపుకున్నాడు.

ఏ నిశ్చయానికి రాలేని చక్రపాణి మరునాడు ప్రయాణంకట్టాడు. పెట్టె సర్దకముందే, విమలకు చెప్పివద్దామన్నట్లు ఆమె గదిలోకి వెళ్ళాడు. విమల మంచం మధ్యలో పాత ఉత్తరాలన్నీ తెరుచుకుని కూర్చుంది. చూస్తే అన్నీ ఒక్కసారే చదువుతున్నదా అనిపించేట్లు! అది చూసిన చక్రపాణి మళ్ళా బలహీనుడయ్యాడు. అవన్నీ తను వ్రాసిన ఉత్తరాలే! "విమలా" అన్నాడు. అతని గొంతు కొంచెంగా కంపించింది. విమల ఉలిక్కిపడి వెనుతిరిగి చూసింది. గది గడప దగ్గర నిలబడ్డాడు చక్రపాణి. విమల వుద్వేగం పట్టలేక వంగి తల ఒళ్ళో పెట్టుకుని గట్టిగా ఏడ్చింది. చక్రపాణికి ఎవరో కొట్టినట్లయింది. దగ్గరకు వెళ్ళి "ఎందుకేడుస్తావ్ విమలా, లే!" అన్నాడు జాలిగా. విమల తల ఎత్తింది. కళ్ళు తుడుచుకుంది. వణికిపోయే గొంతును అదుపులోకి తెచ్చుకుంది. కసిగా చక్రపాణి వంక చూసింది. "ఎందుకొచ్చావిక్కడికి? వెళ్ళు. అనురాగంపైన అధికారం చలాయించటం-అప్పుడవు నీకే సరిపోయింది. ఛీ, నా కసహ్యమేస్తోంది నిన్ను చూస్తే!" అని మళ్ళీ తల దాచుకుంది. చక్రపాణి పోలేదు. మరింతగా సమీపించి ఆమెను లేవనెత్తాడు. విమలకు వూపిరి సల్పలేదు. చక్రపాణి ముగ్ధుడై ఆమె కళ్ళలోకి చూస్తూ "ఎందుకు నా చేతుల్లోంచి పారిపో చూస్తావ్ విమలా! మానవత్వ మెప్పుడూ జయిస్తుంది. నిన్ను నా గుండెల్లో దాచుకుంటానింక. నీ కిక స్వేచ్ఛలేదు. నీవు నా బందీవి!" అన్నాడు. విమల తన స్వేచ్ఛ పోయిందని విచారించలేదు. ఆమె పెదవుల వంపులలో చిక్కు పడిపోయిన చిరునవ్వు వెలికి రాలేక అట్టేనిలిచిపోయింది.

---o---